సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- పోలీస్ అకాడమీలో ప్రీ ప్రమోషనల్ శిక్షణ ప్రారంభం

శిక్షణలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): పోలీసు సిబ్బంది ఆర్థిక ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి (ఆర్బీవీఆర్ఆర్) తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో మంగళవారం ప్రీ ప్రమోషనల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను మంచి రాబడి వచ్చే రంగాల్లో పెట్టుబడి పెట్టాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆర్బీవీఆర్ఆర్, టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్ట్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు.

కుప్పకూలిన నిర్మాణరంగం

మొదటిపేజీ తరువాయి...

అధికారిక లెక్కలను పరిశీలించినా నిర్మాణరంగం క్రమంగా కుదేలవుతున్నదనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి. రియల్ఎస్టేట్, నిర్మాణ రంగాలంటేనే శివారు ప్రాంతాలు. అలాంటిది రెండేండ్లతో పోలిస్తే చుట్టూ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణ అనుమతుల్లో భారీ తగ్గుదల నమోదుకావడం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతున్నది. 2019లో ఈ రెండు రంగాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత అనూహ్యంగా కొవిడ్‌తో లావాదేవీలు, క్రయవిక్రయాలు కాస్త మందగించాయే కానీ భారీ తగ్గుదల నమోదు కాలేదు. అందుకే కొవిడ్ సమయంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణ రంగానికి లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సి వచ్చింది. కొవిడ్ అనేది రెండు రంగాలకు ఒక స్పీడ్ బ్రేకర్‌గా మాత్రమే మారింది. కానీ, దూకుడును తగ్గించలేకపోయింది. నగరం చుట్టూ ఉన్న స్థానిక సంస్థల పరిధిలో 2021, 2022 సంవత్సరాల్లో అనుమతుల సంఖ్యను చూస్తే ఇదే విషయం అర్థమవుతుంది. ప్రధానంగా 2021 నుంచి 2022కు అనుమతులు 22% మేర పెరిగాయి.

పడిపోతున్న అనుమతులు

రాష్ట్రంలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 ఆదిలో రియల్ ఎస్టేట్-నిర్మాణ రంగాల్లో కొంత మేర స్తబ్ధత నెలకొన్నా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ ఇలాగే ఉంటుందని నిపుణులు సైతం అనుకున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత హైదరాబాద్ రియల్‌ఎస్టేట్ నిర్మాణ రంగాలు ఊపందుకుంటాయని చెప్పారు. హైడ్రా దూకుడుగా నిర్మాణాల కూల్చివేత చేపట్టడంతో రేపో మాపో కోలుకుంటుందనుకున్న రియల్ ఎస్టేట్-నిర్మాణ రంగాల్లో అదే స్తబ్ధత కొనసాగడంతోపాటు తగ్గుదల మొదలైంది. 2023తో పోలిస్తే 2024లో 16 స్థానిక సంస్థల పరిధిలో అనుమతులు ఏకంగా 36% తగ్గాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. దాని ఫలితంగానే రియల్టర్లు, బిల్డర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. దాని పర్యవసానంగానే నిర్మాణ రంగంలో ఆత్మహత్యలు చోటుచేసుకోవడం దురదృష్టకరం.

మున్సిపాలిటీ	2022	2023	2024
ఆదిభట్ల	141	192	294
ఆమనగల్	68	70	65
బడంగ్‌పేట్	3,335	3,605	1,320
బండ్లగూడ జాగీర్	1,248	1,321	1,147
ఇబ్రహీంపట్నం	240	166	110
జల్‌పల్లి	97	166	116
కొత్తూరు	34	31	24
మణికొండ	86	843	263
మీర్‌పేట్	1,119	358	388
నార్సింగి	152	186	193
పెద్ద అంబర్‌పేట్	245	,097	790
షాద్‌నగర్	697	609	250
శంషాబాద్	24	74	43
శంకర్‌పల్లి	367	343	212
తుక్కుగూడ	168	112	114
తుర్కయాంజాల్	363	1,627	1,620

'ఇందిరమ్మ' గైడ్‌లైన్స్‌పై కాలయాపన

- నగరాలు, పట్టణాల్లో లక్షల దరఖాస్తులు పెండింగ్
- సొంత జాగాలు లేనివారు 90% పైనే

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇంతవరకు జారీ చేయలేదు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి గ్రేటర్ హైదరాబాద్‌లోని 25 నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని 40 అర్బన్ నియోజకవర్గాల్లో పేదల నుంచి దాదాపు 82 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మార్గదర్శకాలు లేకపోవడంతో వాటిని పెండింగ్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలి దశలో జాగా ఉన్నవారికే ఇల్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు ఇంటిని పొందే అర్హత కోల్పోతున్నారు. మురికివాడల్లో నివసిస్తున్న పేదల్లో ఎక్కువ శాతం మందికి సొంత జాగాలు లేవు. వారంతా అనాదిగా ప్రభుత్వ భూముల్లోనే గుడిసెలు, కచ్చా ఇండ్లు నిర్మించుకొని కాలం వెళ్లదీస్తున్నారు. చాలా కాలం నుంచి వారు అక్కడే ఉంటుండడంతో కరెంట్, నల్లా కనెక్షన్లు మంజూరయ్యాయి. కానీ, ఇండ్ల పట్టాలు గానీ, ఆయా జాగాలపై యాజమాన్య హక్కులు సూచించే ద్రువపత్రాలు గానీ లేవు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 10 లక్షల మందిలో 90% మందికి సొంత జాగాలు లేవు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర పట్టణాల్లో సైతం ఇంచుమించు ఇదే పరిస్థితి ఉన్నది. దీంతో వారంతా ఇందిరమ్మ ఇల్లు పొందే అర్హత కోల్పోయినట్టే.

పట్టణాల్లో రెండు విధాలుగా ఇండ్ల నిర్మాణం

ప్రభుత్వ జాగాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇవ్వ డం ఒక విధానమైతే, ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశం నుంచి పేదలను ఖాళీ చేయించి అదేచోట అపార్ట్‌మెంటు నిర్మించి అందరికీ కేటాయించడం మరో విధానం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జియాగూడ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఈ విధంగానే అపార్ట్‌మెంట్లు నిర్మించి లబ్ధిదారులకు అందించింది. ఇతర మురికివాడల్లో నివసిస్తున్నవారికి ప్రభు త్వ జాగాలు ఉన్నచోట డబుల్ బెడ్రూ మ్ ఇండ్లను నిర్మించి ఇచ్చింది. ఇలా గ్రేటర్ హైదరాబాద్‌లోని లక్ష పేద కుటుంబాలకు ఇండ్లను సమకూర్చింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాగాలు లేవనే కారణంతో పట్టణ పేదలకు ఇండ్లను మంజూరు చేయకుండా, కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తున్నది.

స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు 30 వేలు లంచం

ధారూరు, ఫిబ్రవరి 11 : లంచం తీసుకుంటూ వికారాబాద్ జిల్లా ధారూరు ఎస్సై మంగళవారం ఏసీబీకి చిక్కాడు. ధారూరు మండలం నాగసముందర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తన ప్రైవేటు డ్రైవర్ బీరప్ప ద్వారా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు మంగళవారం రూ.30 వేలు లంచం ఇవ్వగా ఏసీబీ అధికారులు ఎస్సైని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పరీక్షల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్, టెన్త్ పరీక్షలు ముగిసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్‌తో కలిసి ఎలక్షన్ కమిషన్ సంయుక్త కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

కుంభమేళాకు వెళ్లివస్తూ.. ఏడుగురు దుర్మరణం

మొదటిపేజీ తరువాయి...

బస్సు నుజ్జునుజ్జయ్యింది. ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. బస్సులో ఇరుక్కుపోయిన మరో ఆరుగురిని స్థానికులు బయటకు తీసి జబల్‌పూర్ మెడికల్ కాలేజీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మినీ బస్సు వెనుక ఓ కారు కూడా ప్రమాదానికి గురైనప్పటికీ అందులో ఉన్న వారు సురక్షితంగా బయటపడినట్టు ఏఎస్పీ సూర్యకాంత్ శర్మ తెలిపారు.

నాచారంలో విషాదఛాయలు

ఈ ఘటన మృతులంతా నాచారంలోని రాఘవేంద్రనగర్, కార్తికేయ నగర్‌కు చెందినవారు. మంగళవారం తెల్లవారుజామునే బయలుదేరుతామని కుటుంబసభ్యులకు చెప్పారు. ఉదయాన్నే ప్రమాదవార్త తెలియడంతో రోదనలు మిన్నంటాయి. మృతుల్లో నవీన్, బాలకృష్ణ, సంతోష్, శశికాంత్, రవి, ఆనంద్ ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్టు మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణలో లోపాలు

- కొన్ని కులాలకు తీవ్ర అన్యాయం
- లోపాలు సవరించి న్యాయం చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వర్గీకరణపై చర్చిస్తున్న మంద కృష్ణమాదిగ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం ఆయన భేటీ అయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను చిత్తశుద్ధితో చేపట్టినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, సీఎంకు ఒక సోదరుడిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వర్గీకరణలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. అసెంబ్లీలో చర్చించి, క్యాబినెట్ సబ్ కమిటీ, న్యాయ కమిషన్లను నియమించి, నివేదికలపై క్యాబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని తెలిపారు. లోపాలు, అభ్యంతరాలను క్యాబినెట్ సబ్ కమిటీతోపాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం సూచనల మేరకు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మందకృష్ణ చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయని స్పష్టంచేశారు. కొన్ని కులాలకు అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రధానంగా వెనుకబడిన మాదిగ కులానికి అన్యాయం జరిగిందని తెలిపారు. 'గ్రూప్ బీ'కి కేటాయించిన రిజర్వేషన్లను 9 నుంచి 11 శాతానికి పెంచాలని కోరినట్టు వివరించారు. ఎక్కువ జనాభా ఉన్న నేత కానీలను మాలలున్న సీ గ్రూప్‌లో వేయడం వల్ల వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. జనాభా తక్కువగా ఉన్న కొన్ని కులాలను మొదటి గ్రూప్‌లో చేర్చి ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారని, అదే సమయంలో ఎక్కువ మంది ఉన్న బేడ బుడగ జంగాలను అత్యధికంగా వెనుకబడిన ఏ గ్రూపులో వేశారని తెలిపారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాలలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లు కేటాయించారని మండిపడ్డారు. వీటితోపాటు పలు అంశాలను సీఎంతోపాటు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి వివరించినట్టు చెప్పారు.

మహిళా పోలీసులు 4,782 మందే

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్‌శాఖలో అన్ని విభాగాల్లో మొత్తం 76,292 మంది అధికారులు, సిబ్బంది ఉండగా, వీరిలో మహిళా అధికారులు, సిబ్బంది 4,782 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఎస్సై నుంచి డీజీ స్థాయి వరకు 67 మంది, కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు 3,642 మంది, ఏఆర్‌లో 1,073 మంది ఉన్నారు. మరో 868 మంది హోంగార్డులుగా ఉన్నారు. సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు పోలీస్‌శాఖ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చినట్టు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఎస్సార్ విజయకేతనం..

నాగసిద్ధార్థ, తేజస్ ఉద్భవ్‌రెడ్డి, రాజవర్షిత్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 11: జేఈఈ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లాల నాగసిద్ధార్థ(ఫిజిక్స్‌లో 99.97 పర్సంటైల్) సాధించి ఎస్సార్ కీర్తిప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టినట్టు చెప్పారు. తాడిపత్రి తేజస్ ఉద్భవ్ రెడ్డి(99.83), మారం రాజవర్షిత్‌రెడ్డి (99.81), దిడ్డి ప్రజ్వల్‌కుమార్ (99.77), యాద భరణిశంకర్ (99.77), చల్లా అన్నిక(99.66), మేడ కార్తీక్ (99.66), జోగు అభిరాం (99.60), కడారి సంజయ్ (99.58), చిన్ని కమలావర్ధన్(99.58)తోపాటు మొత్తం 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్టు వివరించారు. విద్యార్థుల తోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 11 : మండలంలోని అన్నారం గ్రామంలో ప్రమాదాల నివారణపై ఎన్‌డీఆర్ఎఫ్ టీం సభ్యులు మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, గుండెపోటుతో పాటు ఇతర విపత్తు సమయంలో పాటించాల్సిన పద్ధతులపై డెమో ద్వారా ప్రజలకు వివరించారు. తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీవో ప్రసాద్, ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి, జీపీ కార్యదర్శి సమ్మయ్య, మద్దులపల్లి, పల్గుల, సంద్రుపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథ ఆడబిడ్డలకు ఉచితంగా వివాహాలు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 11: జిల్లాలో తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ ఆడబిడ్డలకు జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివాహాలు జరిపిస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు అయిలి మారుతి మంగళవారం ప్రకటనలో తెలిపారు. సొంత తల్లిదండ్రుల్లాగా అన్ని తామే అయి పుస్తె మట్టెలు, బోళ్లు, బీరువా, కూలర్, మిగతా సామగ్రి, భోజనాలు, అన్నీ తామే చూసుకుంటామన్నారు. అంతేకాకుండా సొంత అన్నల్లాగా కాళ్లు కడిగి కన్యాదానం చేస్తామన్నారు. ఈ నూతన వధూవరులకు వచ్చే ఏప్రిల్‌లో వివాహం జరిపిస్తామని తెలిపారు. వివాహ వయసు వచ్చిన అనాథ ఆడబిడ్డలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9391075767, 8185036527 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గణపురం, ఫిబ్రవరి 11: మహిళలు ఆహారం, ఆరోగ్యంపై అగాహన పెంచుకోవాలని డీఆర్‌డీవో పీడీ నరేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘం సభ్యులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ సుచరిత, ఏపీఎం ఇమామ్, సీసీలు బాబా శకుంతల పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ నియంత్రణకు చర్యలు

కాటారం, ఫిబ్రవరి 11 : బర్డ్ ఫ్లూ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కుమారస్వామి అన్నారు. మండలంలోని కాటారం, ధన్వాడ, ఒడిపిలవంచ వెటర్నరీ ఆస్పత్రులను ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి పశుగణన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గట్లకుంటలో లేయర్ కోళ్ల పారాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కోళ్ల పెంపకందారులకు బర్డ్‌ఫ్లూపై అవగాహన సమావేశం జరుగుతుందన్నారు. ఆయన వెంట వెటర్నరీ వైద్యులు ధీరజ్, రమేశ్, వంశీ, సిబ్బంది ఉన్నారు.

నిబంధనల మేరకు నడుచుకోవాలి

ములుగురూరల్, ఫిబ్రవరి 11 : నిబంధనల మేరకు వాహన డ్రైవర్లు నడుచుకోవాలని ఆర్డీవో బరగడి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో సమ్మక్క-సారక్క టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు స్వతంత్రం ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ మేరకు ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఆర్డీవోను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల బాలరాజు, ఉపాధ్యక్షుడు డెంగు సిద్ధార్థ, కోశాధికారి కూరాకుల రాజు, సభ్యులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతివనంలో చెట్ల నరికివేత

కాటారం, ఫిబ్రవరి 11 : రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధి బూడిదపల్లి సమీపంలోని పల్లె ప్రకృతి వనంలో చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం పోలీసులు పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి నరికేసిన చెట్ల మొదళ్లు, కొమ్మలను పరిశీలించారు. దీనికి కారకులైనవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారుల అత్యుత్సాహంతోనే నాగేశ్వర్‌రావు ఆత్మహత్య

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 11 : ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో పేరు లేకుండా చేసి అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంతోనే గ్రామసభలో కుమ్మరి నాగేశ్వర్‌రావు హత్మహత్య చేసుకున్నాడని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దావూద్ అన్నారు. మంగళవారం ఆయన పార్టీ మండల నాయకులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మూల మలుపు గుంతలతో ముప్పు

- మినీ జాతర వాహనాలు తిరిగేదెట్లా?
- ప్రమాదకరంగా మారినా పట్టించుకోరా..
- జాతర వరకు ఇసుక క్వారీలను నిలిపివేయాలి

ఐటీడీఏ పీవో నివాస భవనం మూలమలుపు వద్ద గోతులమయమైన రోడ్డు

ఏటూనాగారం, ఫిబ్రవరి 11 : మండలకేంద్రంలోని ఐటీడీఏ పీవో నివాస గృహం మూడు వైపులా ఉన్న మూల మలుపులు గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. పోలీసులు తరచూ చేస్తున్న గుంతల మరమ్మతులు కంటితుడుపుగానే మారుతున్నాయి. జాతీయ రహదారిపై ఉన్న పోలీస్‌స్టేషన్ ముందు నుంచి వాహనాల రాకపోకలు రెండు దశాబ్దాలుగా నిలిచిపోయాయి. దీంతో ఐటీడీఏ పీవో నివాస గృహం చుట్టూ ఉన్న నాలుగు మూల మలుపులు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఈ మూల మలుపుల్లో మూడు చోట్ల పెద్ద పెద్ద గుంతలు పడి అంత్యంత ప్రమాదకరంగా మారాయి. భారీ వాహనాలు, బరువైన వాహనాలు వెళ్లినప్పుడు పెద్ద పెద్ద గుంతల్లో చిక్కుకుని ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఇక మేడారం మినీ జాతరకు వేల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో వచ్చే అవకాశాలు ఉన్నాయి. అనేక చోట్ల రోడ్డ మరమ్మతులకు నిధులు కేటాయించిన ప్రభుత్వం అవసరమైన చోట మాత్రం కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మేడారం మినీ జాతర ప్రారంభమైనా అధికారులు శాశ్వత పనులు చేపట్టకపోవడంతో తరచూ ట్రాఫిక్ జాం కావడంతో పాటు, వాహనాలు గుంతల్లో కింద తగిలి కుప్పకూలే అవకాశాలు ఉన్నాయి. పెద్ద పెద్ద గుంతలు ఉన్నప్పటికీ వీటి నుంచే లారీలు, బస్సులు వెళ్తున్నాయి. ఈ మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఇక్కడ శాశ్వత నిర్మాణం చేపట్టకుండా అధికారులు అలసత్వం వహిస్తూ పెద్ద గుంతలు పడినపుడు కంకర పోసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వాహనాదారులు నరకం చూస్తున్నారు. తాము రోడ్డు ట్యాక్స్‌లు చెల్లిస్తున్నప్పటికీ సంవత్సరాల తరబడి శాశ్వత మరమ్మతులు చేపట్టకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేక సార్లు భారీ వాహనాలు గుంతల్లో ఇరుక్కుని ట్రాఫిక్ జాం అవుతుండగా పోలీసులు జేసీబీలను తీసుకొచ్చి క్లియర్ చేస్తున్నారు. జాతీయ రహదారి అధికారులు చేయాల్సిన పనులను పోలీసులు నిర్వర్తిస్తున్నారు. సంవత్సరాల తరబడి ఇక్కడ ఇబ్బంది జరుగుతున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాహనాల డ్రైవర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడారం జాతర సమయంలో ఈ రూటులో వచ్చే వాహనాల పరిస్థితి ఏమిటో అధికారులకే తెలియాలి. జాతర సమయంలో ట్రాఫిక్ జాం కావడం ఖాయమని వాహనదారులు అంటున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి వారం రోజుల పాటు ఇసుక లారీల రవాణాను నిలిపివేయాలని భక్తులు కోరుతున్నారు. ఇక ఇసుక లారీల వేగం, అధిక లోడు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఉన్నందున జాతర పూర్తయ్యే వరకు ఇసుక క్వారీలను నిలిపివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జాతీయ రహదారి విభాగం అధికారులు ఇక్కడ రోడ్డు పటిష్టతను పెంచే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రామప్పలో భక్తులకు ఏర్పాట్లు

వెంకటాపూర్, ఫిబ్రవరి 11 : మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంలో మినీ మేడారం జాతర సందర్భంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి నుంచి మూడు రోజులపాటు జరిగే మేడారం జాతరకు వచ్చే భక్తులు తిరుగుప్రయాణంలో రామప్ప దేవాలయాన్ని సందర్శించడం ఆనవాయితీ. ఆలయ సందర్శనకు వచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూలైన్‌లతోపాటు, తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు ఆలయ ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

కాటారం, ఫిబ్రవరి 11 : కాటారం సబ్ డివిజన్‌లో ఇసుక లారీలను నియంత్రించాలని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ కోరారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా అక్రమంగా కొంత మంది లారీల ద్వారా ఇసుక తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇసుక లారీలు ప్రజలకు ప్రాణసంకటంగా మారాయని, ఇటీవల మండలకేంద్రంలో తోట రవి అనే వ్యక్తి ఇసుక లారీ ఢీకొని రెండు కాళ్లు కోల్పోయాడని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తీవ్రంగా గాయపడ్డ రవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

యువతకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 11 : జిల్లాలోని యువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు సింగరేణి భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి కే మారుతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో డ్రైవింగ్ నేర్చుకున్న యువకులు కాంట్రాక్టు ఉద్యోగులుగా, వోల్వో డ్రైవర్లుగా వేతనాలు పొందుతూ అనేక మంది స్థిరపడ్డారని తెలిపారు. సింగరేణి విస్తరించిన జిల్లాల్లో నిపుణులైన డ్రైవర్ల కొరత తీర్చేందుకు యువకులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మండపల్లిలోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ స్కిల్స్ (టైడ్స్)ను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల యువకులకు వాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 8985431720 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

మీసేవలో రేషన్ కార్డుల నమోదు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 11: నూతన రేషన్ కార్డుల నమోదు ప్రక్రియకు మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం కల్పించినట్లు అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ చేయడంలో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు నిర్దేశించిన రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు,